ముస్తాబవుతున్న గణనాథులు

- ప్రతిమల తయారీలో రాజస్థానీలు
- వివిధ ఆకృతులు, రంగులతో ఆకర్షణీయంగా..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు గణపతి ప్రతిమలు సిద్ధమౌతున్నాయి. గణపతి నవరాత్రి మహోత్సవాలు అంటే యువతలో ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. గతంలో ఊరిలో రెండు మూడు ప్రాంతాల్లోనే నిర్వహించే గణపతి నవరాత్రి మహోత్సవాలు నేడు ప్రతి పేట, వీధిలోనూ నిర్వహిస్తున్నారు. ఒక మోస్తరు నుంచి భారీ విగ్రహాల ఏర్పాటుకు సిద్ధమౌతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో సైతం ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు, ప్రసాదాల పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ముందుకువెళుతున్నారు. ఏలూరు నగరంలో అనేక సంవత్సరాలుగా స్థానిక కుండీ సెంటర్, పేరయ్య కోనేరు ప్రాంగణం, ఎన్ఎస్ కూరగాయల మార్కెట్ వద్ద భారీ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ప్రతిమల తయారీ

నగరంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ప్రతిమలను సిద్ధమవుతున్నాయి. ఇటీవల మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలని ప్రచారం జరుగుతున్నా ఆకర్షణీయమైన విగ్రహాలు కావాలంటే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో రూపొందించిన ప్రతిమలే ఉత్తమమని ఉత్సవ కమిటీలు భావిస్తున్నారు. మట్టి గణపతి ప్రతిమల కంటే ధర కూడా తక్కువగా ఉండడంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలే పెద్ద సైజువి లభిస్తాయని యువకులు మక్కువ చూపుతున్నారు.


ప్రాథమిక స్థాయిలో తయారవుతున్న గణపతి ప్రతిమలు


రంగులు స్ప్రే చేస్తూ సిద్ధం చేస్తున్న ప్రతిమ

విగ్రహాల తయారీలో రాజస్థానీలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు తయారు చేయడంలో రాజస్థానీలు సిద్ధ హస్తులు. ప్రతి పట్టణ, నగర ప్రాంతాల్లో వీరు ఏళ్ల తరబడి ఇక్కడే ఉండి ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఈ మేరకు నగరానికి కొందరు రాజస్థానీలు వలస వచ్చి 40 ఏళ్లుగా ఏలూరులోనే స్థిరపడిపోయారు. దాదాపు 30 కుటుంబాల వారు ఇదే పనిలో ఉంటున్నారు. గణపతి నవరాత్రి సమయంలో గణపతి ప్రతిమలు, ఇతర సమయాల్లో శ్రీకృష్ణుడు, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, ఆంజనేయ స్వామి వంటి దేవుళ్ల ప్రతిమలతో పాటు ఫ్లవర్‌వాజ్‌లు, ఇతరత్రా గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఆకర్షణీయంగా..

రాజస్థానీలు రూపొందించే ప్రతిమలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. మంచి రంగుల కాంబినేషన్ వినియోగించడంతో పాటు ఏ ఏటికాఏడు నూతన ఆలోచనలతో ప్రతిమల్లో వెరైటీగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరు తయారు చేసే ప్రతిమల్లో శివ పార్వతులతో కలిసి ఉన్న గణపతి, శ్రీ వేంకటేశకవర స్వామి అలంకరణలో గణపతి, సిద్ధి, బుద్ధి సమేత గణపతి, ఇలా వివిధ అలంకరణలతో పాటు నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా క్రీడా గణపతి, పంచముఖ గణపతి వంటి ప్రతిమలు తయారు చేస్తున్నారు. కరోనా సమయంలో ప్రతిమలు తయారు చేసినా అమ్ముడు కాక నష్టపోయినా.. ఆ తరువాత కాలంలో ప్రతిమలు బాగానే అమ్ముడుపోయాయి. అయితే ఇక్కడే నెలల తరబడి ఉంటూ ప్రతిమలు తయారు చేస్తున్నా నవరాత్రుల సమయానికి ఇతర ప్రాంతాల నుంచి కొందరు గతంలో తయారు చేసిన ప్రతిమలకు నూతనంగా రంగులు వేసి పైపై మెరుగులు దిద్ది ఇక్కడకు తీసుకొచ్చి తక్కువ ధరకు విక్రయిస్తుండడంతో వీరికి ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది మొత్తం మీద 800 నుంచి 1000 ప్రతిమలు అమ్ముడు పోతాయని ఆశిస్తున్నట్టు తయారీదారులు చెబుతున్నారు.

సబ్సిడీపై రుణాలు అందించాలి



గత 15 సంవత్సరాలుగా ఇక్కడే ప్రతిమలు తయారు చేసే వృత్తిలో కొనసాగుతున్నాను. ఈ ఏడాది ప్రతిమల తయారీకి రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టాను. 5 అడుగుల ప్రతిమ రూ.12 వేలు నుంచి 15 వేలు, 10 అడుగుల ప్రతిమ రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఉంటుంది. అన్నీ సజావుగా జరిగితే నష్టం లేకుండా ఉంటుంది. సాధారణ రోజుల్లో చిన్నచిన్న ప్రతిమలు అమ్మకంతో కేవలం కుటుంబ పోషణకు సరిపడా వస్తుంది. గతంలో అమ ఒడి కింద రూ.15 వేలు రావడంతో కొంత ఉపయోగకరమయింది. మాకు ప్రతిమలు తయారు చేయడానికి సబ్సిడీపై రుణాలు అందించాలి. – పూర్ణ కుమార్, రాజస్థాన్ కళాకారుడు

సాగునీటి కోసం రైతుల ఆందోళన


జాలిపూడిలో నీరు లేక ఎండిపోతున్న చేలలో నినదిస్తున్న రైతులు

ఏలూరు రూరల్ : కృష్ణా డెల్టా భూములకు సాగు నీరు అందించాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, లింగారావుగూడెం, కాట్లంపూడి, జాలిపూడి గ్రామాల్లో ఎండిపోతున్న పంటచేలను సంఘం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదుల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఏలూరు రూరల్ గ్రామాల్లో పంటచేలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతుల పడుతున్న కష్టాలను జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎకరానికి రూ.15 వేలు నుంచి రూ.20 వేలు పెట్టుబడి పెట్టిన అన్నదాతలు సాగునీటి కోసం ఆందోళన చెందుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి కృష్ణా డెల్టా శివారు భూములకు పుష్కలంగా సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ సూర్యనారాయణ, ఆకునూరి భిక్షం, మారుమూడి ఏసు, తేర జాన్, కొరపాటి బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు గడువు పెంచినట్టు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు కళాశాల, కోర్సుల ఎంపికను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్పీ ప్రతాప శివకిషోర్‌కు అభినందన


ఎస్పీ ప్రతాప శివకిషోర్‌ను కలిసిన సందీప్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌ను ఏపీ మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్, మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో ఉన్నత భవితకు బాటలు వేసుకునేలా విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. జిల్లాలో మరింత మెరుగైన రీతిలో ప్రజలకు సేవలు అందించేందుకు జిల్లా ఎస్పీ కృషి చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రమణ

ఏలూరు టౌన్: నగరంలో వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ అన్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని అశోక్‌నగర్ కేపీడీటీ, ఆర్ఆర్‌పేట సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాల ప్రాంతాల్లో వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పీడీబీటీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. మైనర్లు రోడ్లపై మోటారు సైకిళ్లను నడపటం నేరమని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఇష్టారాజ్యంగా మోటారు సైకిళ్లు నడిపితే మోటారు సైకిల్ యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు మదీనా బాషా, సాధిక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఐటీని పరిచయం చేసిన రాజీవ్ గాంధీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతదేశానికి చెందిన అనేక మంది ఐటీ దిగ్గజాలు ప్రపంచ దేశాలను శాసిస్తున్నారంటే దానికి కారణం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వేసిన బీజమేనని కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలపై ఫిర్యాదు


ఇంటర్మీడియట్ బోర్డు అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీ వైష్ణవి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి కార్యాలయ సుపరింటెండెంట్ ఇ.శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ ధన సంపాదనే ధ్యేయంగా ఏలూరు ఎన్ఆర్‌పేటలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఎన్ఆర్ పేటలోని ఒక భవనంలో శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల, ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాల, అపోస్, నాగార్జున యూనివర్సిటీ స్టడీ, ఎగ్జామ్ సెంటర్, ఆంధ్ర యూనివర్సిటీ ఎగ్జామ్స్ సెంటర్, శ్రీ సూర్య హాస్టల్‌లకు అనుమతులు ఇవ్వడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్య పరీక్షలు ఆ భవనంలో నిర్వహిస్తున్నారని, ఆర్ఐఓ కార్యాలయం నుంచి గాని, ఇంటర్మీడియట్ బోర్డు నుంచి గాని ఎటువంటి అనుమతి తీసుకోకుండా వైష్ణవి కళాశాల విద్యార్థులకు యాజమాన్యం సెలవులు ప్రకటించడం వల్ల విద్యార్థులు చదువు కోల్పోతున్నారని, విద్యా సంవత్సరం మధ్యలో ప్రభుత్వ ఆదేశాలు లేకుండా సెలవులు ప్రకటించడం వెనుక ఇంటర్మీడియట్ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని నాని ఆరోపించారు. విద్యార్థులు చదువుని కోల్పోతున్నందున విద్యార్థులు తల్లిదండ్రులు టీసీలు ఇవ్వండి వేరే కళాశాలలో జాయిన్ అవుతాం అని అడుగుతున్నా యాజమాన్యం టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వార్తలు వినపడుతున్నాయని తెలిపారు. సమస్యపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎం క్రాంతి, ఎస్ సునీల్ కుమార్, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదిస్తాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ శ్రీ వైష్ణవి కళాశాలపై పీడీఎస్‌యూ నాయకులు చేసిన ఫిర్యాదులపై ఆ కళాశాలలో విచారణ నిర్వహించామని, విద్యార్థులకు అనధికారికంగా సెలవులు ప్రకటించడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎస్‌యూ ఫిర్యాదులోని ఇతర అంశాలపై మరింతగా విచారణ చేయాల్సి ఉందని, విద్యార్థులకు టీసీలు ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురైతే ఆర్ఐఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర అంశాలపై విచారణ చేసి ఉల్లంఘనల విషయంపై క్రమశిక్షణ చర్యలకు ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదిక సమర్పిస్తామని స్పష్టం చేశారు.

సంతానలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి


సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజ అనంతరం మంగళగౌరీ వ్రతాలను ఆచరించారు. అమ్మవారికి సంతానలక్ష్మి అలంకరణ చేశారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

దెందులూరు: మండలంలో 9 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని ఎంపీడీఓ వీ.శ్రీలత అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్ష చేశారు. హాజరు నమోదు చేయకుండా, యూనిఫాం ధరించని వారు, శాఖాపరమైన విధి నిర్వహణ తెలియని 9 మంది సచివాలయ ఉద్యోగులను గుర్తించామన్నారు. సమీక్ష సమావేశంలో డీపీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి వారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు 9 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ అన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల బాలికలపై దాడులు పెచ్చుమీరుతోన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక యాదవ్ నగర్‌లోని సూర్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో బయట వ్యక్తులే కాకుండా పరిచయమైన వ్యక్తులతో అయినా బంధువులతో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే పురుషులతో సమానంగా బాలికలు కూడా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. ఎటువంటి సమస్య వచ్చినా ఒక ఉత్తరం ద్వారా గాని లేదా 08812 224555కు ఫోన్ ద్వారా గాని సంప్రదిస్తే తగు న్యాయ సహాయం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కూన కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, ఎ.గంగాభవాని, స్కూల్ ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐలునాయకులు

ఏలూరు (టూటౌన్): కోల్‌కత్తాలో ట్రైనీ మహిళా వైద్యురాలిని హత్యచేసిన అసలు దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఏలూరు నగర కమిటీ జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మహిళా వైద్యుల రక్షణ చట్టం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టే వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయ భాస్కర్ మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై హత్యను ఖండించారు. ఐలు ఏలూరు నగర అధ్యక్షుడు పి.వెంకట్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాలు లభ్యత లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.కిషోర్‌కుమార్, ఆంజనేయులు, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నుంచి కాపాడిన రోనాల్డ్ రోస్


రోనాల్డ్ రోస్ గురించి వివరిస్తున్న శర్మిష్ట

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవ సమాజాన్ని మలేరియా మహమ్మారి నుంచి కాపాడిన మహనీయుడు డాక్టర్ సర్ రోనాల్డ్ రోస్ అని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ శర్మిష్ట చెప్పారు. ప్రపంచ దోమల దినోత్సవ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కేంద్ర కార్యాలయంలో బ్యానర్ ఆవిష్కరించి, రోనాల్డ్ రోస్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. అనంతరం స్థానిక కోటదిబ్బ కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. షర్మిష్ట మాట్లాడుతూ 1897 సంవత్సరం ఆగస్టు 20న తేదీన ఇన్ఫెక్టెడ్ ఆడ అనాఫిలాస్ దోమ కుట్టడం వల్ల దోమ నుంచి మనిషికి మలేరియా సోకుతుందని నిరూపించడం వల్ల ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని వివరించారు. అనాఫిలిస్ దోమ మంచి నీటి నిల్వ ప్రాంతాలైన నీళ్లతొట్టెలు, నీళ్ల డ్రమ్ములు, రుబ్బురోలు, గ్రైండర్స్, వాడేసిన ప్లాస్టిక్ వస్తువులు, మంచినీటిలో ప్రాంతాలు, పూల కుండీలు, ఫ్లవర్ వాజులు తదితర ప్రాంతాల్లో పెరుగుతాయని, దీంతో వారానికి ఒకసారి ఫ్రైడ్ డ్రై డే ఆచరించాలని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని, ఎవరైనా తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, చమటలు పెట్టడం మొదలుగు లక్షణాలు ఉంటే మలేరియ జ్వరం కావచ్చని వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చీరలు, పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శివానుసూయ విద్యానిధి ఫౌండేషన్ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్ఆర్ పేటలో ఉన్న గోసంరక్షణ సమితి ప్రాంగణంలో మహిళలకు చీరలు, విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరంలో శివానుసూయ విద్యానిధి ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎందరో పేదల జీవితాల్లో వెలుగునిస్తున్నాయని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునగాల మురళీకృష్ణ, విజయలక్ష్మి దంపతులను సన్మానించారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం సాయి సుమంత్, డైరెక్టర్ ఎం.సాయి ప్రశాంత్, మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు, గోసంరక్షణ సమితి ట్రెజరర్ కూరపాటి నాగేశ్వరరావు, ప్రేమాలయం గురూజీ టీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి


మాట్లాడుతున్న అల్లాడి దేవకుమార్

ఏలూరు (టూటౌన్): ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్ చార్జీలను పెంచాలని రాష్ట్ర దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. 2024–25 ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై పౌర సమాజ ప్రతినిధుల సదస్సు మంగళవారం స్థానిక లేడీస్ క్లబ్‌లో జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. దేవ కుమార్ మాట్లాడుతూ జీఓ 2018 ప్రకారం హాస్టల్ మెస్ ఛార్జీలు కొనసాగడం బాధాకరమన్నారు. మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు పునరుద్ధరించాలని కోరారు. రిటైర్డ్ ఎలక్ట్రికల్ జేఏఓ సాయిబాబా, రిటైర్డ్ డీఈఓ జి.వెంకటేశ్వరరావు, మానవత సంస్థ ప్రతినిధి మేతర అజయ్ బాబు, ఎస్సీ సెల్ సభ్యులు ఎం రాజు, వైస్ డైరెక్టర్ నమ్మిన లక్ష్మి కుమారి, సాతులూరి శ్రీనివాసులు, వాసే జైపాల్, మెరుగు వీరాస్వామి, రాష్ట్ర దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కోఆర్డినేటర్ రమణమూర్తి, రీజినల్ కోఆర్డినేటర్ జి.రమాదేవి మాట్లాడారు.

స్టాప్ డయేరియాపై అవగాహన


ఏలూరు 10వ డివిజన్‌లో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మలేరియా విభాగం వారితో కలిసి స్థానిక 10వ డివిజన్ లోని కుండి సెంటర్, నల్లమందు సందు, నున్నవారి సందు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమంతో పాటు దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయించామని నిమున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు మురళి, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి


డీఆర్‌డీఏ పీడీ విజయరాజుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో అక్రమంగా తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత వీవోఏలను రాజకీయ వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. కనీసం సమాచారం లేకుండా, ఏ తప్పు లేకుండా తమ ప్రభుత్వం తమ ఇష్టం అన్నట్లు అక్రమంగా వీవోఏలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులే నేరుగా వెళ్లి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించి గ్రూపుల ఆమోదం తీసుకోకుండా గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేయకుండా వీవోఏలను తొలగిస్తున్నారని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, తొలగింపులు ఆపాలని, వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఈ నెలాఖరులో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. పీడీని కలిసిన వారిలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి, జిల్లా నాయకులు మేరీ తదితరులు ఉన్నారు.

జ్వరాలకు ముందస్తు చికిత్సతో మేలు

ఏలూరు రూరల్ : టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా జ్వరాల నివారణకు ముందస్తు చికిత్స ఎంతో మేలు చేస్తుందని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె.హనుమంతరావు ఆధ్వర్యంలో వైద్య విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తినడానికి ముందు, కాలకృత్యాల తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పేర్కొన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చేయడంతో పాటు పూర్తిగా దుస్తులు ధరించి, దోమ తెరలు వాడడం వల్ల దోమలు కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. డయేరియా, డీహైడ్రేషన్ రాకుండా మరిగించి చల్లార్చిన నీరు, ఫ్లూయిడ్స్ తీసుకోవాలని అన్నారు. వైద్యులు సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	20.15	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	23